తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 45 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ శనివారం 14 -9-2024 వెల: 5/రూ -


## కేంద్రం ఎలాంటి షరతులు లేకుండా

# నిధులు ఇవ్వాలి

### రాష్ట్రం మునిగినా ఎన్‌డీఆర్ఎఫ్ నిధులు వాడుకోలేని స్థితి

### ఎస్ఎస్ఆర్, ఎన్‌డీఆర్ఎఫ్‌కు పొంతన లేకపోవడం వల్లే..

- 1350 కోట్ల నిధులున్నా రూపాయి వాడుకోలేకపోతున్నాం
- విపత్తు నిధులపై ఉన్న నిబంధనలను కేంద్రం సడలించాలి
- మున్నేరు ముప్పు నివారణకు రిటైనింగ్ వాల్ తప్పనిసరి
- వైపరీత్యాలపై హెచ్చరికల కోసం ఓ వ్యవస్థ ఉండాలి: సీఎం
- కేంద్ర బృందంతో భేటీ.. 10 వేల కోట్ల నష్టంపై నివేదిక
- కేంద్ర మంత్రులు అమిత్ షా, గజేంద్రసింగ్, కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు సీఎం రేవంత్ ఆహ్వానం

హైదరాబాద్: విపత్తుల నిధుల వినియోగానికి సంబంధించి అమల్లో ఉన్న కఠిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సడలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌డీఆర్ఎఫలో రూ.1,350 కోట్లు అందుబాటులో ఉన్నా.. ప్రస్తుత నిబంధనల ప్రకారం రూపాయి కూడా వాడుకునే పరిస్థితి లేదని కేంద్ర బృందాలకు వివరించారు. కేంద్రం నిబంధనల ప్రకారం..



2లో



# కేజ్రీకి బెయిల్

- సీబీఐ కేసులో మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- ఇంతకుముందే ఈడీ కేసులో విముక్తి
- జైలు నుంచి విడుదలైన ఢిల్లీ సీఎం
- విచారణ సందర్భంగా.. సీబీఐ తీరును తప్పుబట్టిన అత్యున్నత న్యాయస్థానం
- బెయిల్ మీద విడుదలవుతుంటే అరెస్టు చేయాల్సినంత తొందరేమిటి?
- పంజరంలో చిలుకలా ఉండొద్దు
- నిష్పాక్షికంగా వ్యవహరించండి



# ట్రిబ్యునల్ అవసరమే లేదు

### బ్రిజేశ్ ట్రిబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు

హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి ప్రత్యేక ట్రిబ్యునల్ అవసరమే లేదని ఏపీ సర్కారు పేర్కొన్నది. ఈ మేరకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ దాఖలు చేసిన స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్ఓసీ)పై తాజాగా కౌంటర్ రిజాయిండర్‌ను సమర్పించింది.


# ఎమర్జెన్సీకన్నా దారుణం

- ఆదిలాబాద్ నుంచి అలంపూర్ దాకా నేతల అరెస్టులు అన్యాయం: హరీశ్‌రావు
- అరికెపూడి గాంధీకి బందోబస్తు ఇచ్చి మరీ కౌశిక్‌రెడ్డిపై దాడి చేయించారు
- సీఎం బజారు భాష వల్లే రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం.. మీడియా లీకులు, చిట్‌చాట్‌లతో శాంతిభద్రతలు సాధ్యం కావు
- ఫిర్యాదు చేయడానికి వెళ్తే అరెస్టు చేసి అటవీ ప్రాంతాల్లో తిప్పారని మండిపాటు



హైదరాబాద్: రాష్ట్రంలో ఎమర్జెన్సీ కన్నా దారుణ పరిస్థితులు నెలకొన్నాయని.. సీఎం రేవంత్ చేస్తున్న రాజకీయ డ్రామాలతో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు.

2లో



# హైడ్రాపై స్టే ఇవ్వలేం: హైకోర్టు

- పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రభుత్వానికి నోటీసులు
- జీహెచ్ఎంసీ చట్టప్రకారం అధికారాలెలా కట్టబెడతారని ప్రశ్న
- హైడ్రా ఏర్పాటులో చట్టబద్ధత లోపించినట్లు కనబడుతోందని వ్యాఖ్య



2లో

# కామ్రేడ్.. రెడ్ సెల్యూట్

- ఏచూరికి జేఎన్‌యూ విద్యార్థుల ఘన నివాళి
- నినాదాలు చేస్తూ భావోద్వేగం
- నేటి ఉదయం సీపీఎం కేంద్ర కార్యాలయానికి పార్థివ దేహం

# ప్రజలకు అన్నీ అర్థమవుతున్నాయి

- చంద్రబాబు.. పిల్లలను, మహిళలను, నిరుద్యోగులను మోసగించారు
- మళ్లీ టీడీపీ నేతలు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి
- ఆర్బీకేలు, సచివాలయాలు నిర్వీర్యం.. వలంటీర్ల వ్యవస్థ కనుమరుగు
- ఈ- క్రాప్ లేదు.. ఉచిత పంటల బీమా గాలికొదిలేశారు..
- రైతులకు రూ.20 వేలు ఇస్తామని ఒక్క రూపాయైనా ఇచ్చారా?



2లో

కాకినాడ: వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజలకు ప్రతి ఒక్కటీ డోర్ డెలివరీ చేస్తే ఇప్పుడు ఏది కావాలన్నా టీడీపీ నాయకులను, జన్మభూమి కమిటీలను వేడుకోవాల్సిన దుస్థితి నెలకొందని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తు చేశారు.

డైలీ రిపోర్ట్
శనివారం 14-9-2024
తెలంగాణ జిల్లాలు

# ప్రజలకు అన్నీ అర్థమవుతున్నాయి

'ఎన్నికల ముందు ఈ పెద్ద మనిషి చంద్రబాబు పిల్లలు కనిపిస్తే చాలు.. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు ఇస్తామన్నాడు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏటా రూ.18 వేలు ఇస్తామని వారినీ మోసగించారు. 50 ఏళ్లు దాటిన అమ్మలు కనిపిస్తే చాలు.. జగన్ మీకు రూ.18,000 మాత్రమే ఇస్తాడు! చంద్రన్న రూ.48 వేలు ఇస్తాడంటూ వారినీ మోసం చేశాడు. మరి ఎక్కడైనా రూపాయి ఇచ్చాడా? ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3,000 వంతున ఏటా రూ.36 వేలు నిరుద్యోగ భృతి కింద ఇస్తానన్నాడు. ఈ ప్రభుత్వం ఏర్పడి దాదాపు నాలుగు నెలలైనా ఒక్కటీ అమలు కాలేదు. అమ్మఒడి లేదు.. సున్నా వడ్డీ పోయింది.. చేయూత లేదు! ఇంత అన్యాయంగా అందరినీ మోసం చేస్తూ బడి పిల్లల గోరుముద్దను సైతం నిర్వీర్యం చేశాడు. ఆరోగ్యశ్రీ బిల్లులు రూ.2,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆరోగ్య ఆసరా అసలే లేదు. 108, 104 సిబ్బందికి జీతాలు లేవు. మూడు త్రైమాసికాలు గడిచిపోయినా పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదు. వసతి దీవెన లేదు' అని విమర్శించారు. అధికార పార్టీ నాయకుల ఇళ్లల్లోనే సచివాలయ సిబ్బంది పింఛన్లు పంచుతున్నారని, ఎవరైనా అలా వెళ్లి తీసుకోకుంటే కట్ చేస్తున్నారన్నారు. కూటమి సర్కారు పాలనలో ఎవరైనా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే తిరిగి వారిపైనే రివర్స్ కేసులు పెడుతున్నారని, పాలన అస్తవ్యస్థంగా మారిందని ధ్వజమెత్తారు. 'ఇలాంటి దారుణ పాలన పోవాలి. ప్రజలకు అన్నీ అర్థమవుతున్నాయి. వారు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. చంద్రబాబు మోసాలకు కోపం వస్తోంది. ఆ భయంతోనే రెడ్‌బుక్ పాలనకు తెర తీశారు. అయినా ఏమీ చేయలేరు. ప్రజలు భరించే పరిస్థితి లేదు' అని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సినిమా ఆర్టిస్ట్ అయితే సీఎం చంద్రుబాబు ఫొటోలకే పరిమితమై డ్రామా ఆర్టిస్టుగా మారారని, పవన్ కంటే బాగా నటిస్తున్నారని వ్యాఖ్యానించారు. శుక్రవారం పిఠాపురం నియోజకవర్గం ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులను కలుసుకున్న అనంతరం రమణక్కపేటలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే...మధ్య 30.85 లక్షల మంది రైతులకు రూ.3,411 కోట్లు ఇన్సూరెన్స్ డబ్బులు మాత్రమే చంద్రబాబు పంటల బీమా కింద ఇచ్చారు. అదీ కూడా ప్రీమియం రైతులు కడితేనే వచ్చాయి. మరి ఆయన ఇచ్చింది ఏమిటి? అదే జగన్ హయాంలో రైతులు ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకుండానే 2019%-%24 మధ్య 54.55 లక్షల మందికి రూ.7,802 కోట్లు ఉచిత పంటల బీమా కింద అందాయి. మా ప్రభుత్వమే పూర్తి ప్రీమియం చెల్లించింది.

# కేజ్రీకి బెయిల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. నేర నిరూపణ జరగకుండానే నిందితులను సుదీర్ఘకాలంపాటు జైలులో నిర్బంధించటం వారి వ్యక్తిగత స్వేచ్ఛ హక్కును హరించటమేనని అత్యున్నత న్యాయస్థానం మరోమారు స్పష్టం చేసింది. పంజరంలో చిలుకలా కాకుండా.. స్వేచ్ఛగా తిరిగే చిలుకలా ఉండాలని సీబీఐకి హితబోధ చేసింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ దాఖలు చేసిన అభియోగాల నుంచి కేజ్రీవాల్‌కు గతంలోనే బెయిల్ లభించిన విషయం తెలిసిందే.అయితే, అదే కేసులో సీబీఐ ఆయనను అరెస్టు చేయటంతో.. జైలు నుంచి విడుదల కాలేదు. ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్‌ను నిరాకరించింది. దీంతో, కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. బెయిల్ కోసం కేజ్రీవాల్ తొలుత విచారణ కోర్టుకు వెళ్లలేదని, కాబట్టి, ఆయన విజ్ఞప్తిని విచారణ కోర్టుకు బదిలీ చేయాలని పేర్కొన్నారు.బెయిల్ కోసం తొలుత ట్రయల్ కోర్టుకు వెళ్లాలన్నది వాస్తవమేనని ధర్మాసనం అంగీకరిస్తూ.. హైకోర్టు ఈ కేసుపై విచారణ జరిపినప్పుడు.. కేసును కింది కోర్టుకు బదిలీ చేసి ఉండాల్సిందని స్పష్టం చేసింది. 'ఈ దశలో ఇప్పుడు, తిరిగి ఈ కేసును విచారణ కోర్టుకు పంపించటం సరైంది కాదు. బెయిల్ వ్యక్తిగత స్వేచ్ఛతో ముడివడిన అంశం. ఇటువంటి కేసులను వాటిలో ఉన్న సానుకూలతల (మెరిట్స్) ఆధారంగా నిర్ణయించాలేగానీ.. సాంకేతిక అంశాలను చూపుతూ కోర్టుల మధ్య తిరిగేలా చేయకూడదు' అని పేర్కొంది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సమీప భవిష్యత్తులో పూర్తయ్యేలా లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.కేజ్రీవాల్‌కు బెయిల్ ఇస్తూనే.. తీర్పును న్యాయమూర్తులిద్దరూ వేర్వేరుగా వెలువరించారు. జస్టిస్ సూర్యకాంత్ 27 పేజీల తీర్పును, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ 33 పేజీల తీర్పును ఇచ్చారు. సీబీఐ తీరును జస్టిస్ భుయాన్ ప్రశ్నించారు. ఈడీ కేసులో బెయిల్ వచ్చి జైలు నుంచి కేజ్రీవాల్ విడుదలయ్యే తరుణంలో ఆయనను సీబీఐ అరెస్టు చేయటాన్ని ప్రశ్నించారు. 'దేశంలోని ఒక ఉన్నతస్థాయి దర్యాప్తు సంస్థ సీబీఐ. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా సీబీఐ నిష్పక్షపాతంగా ఉండటమే కాదు.. అలా ఉన్నట్లు కనిపించాలి.సీజర్ భార్యలాగా ఒక దర్యాప్తు సంస్థ కూడా నిష్పాక్షికంగా ఉండాలి. కొంతకాలం కిందటే ఈ కోర్టు సీబీఐని పంజరంలో చిలకతో పోల్చింది. తనపై ఉన్న ఈ ముద్రను సీబీఐ తొలగించుకోవాలి' అని జస్టిస్ భుయాన్ హితవు పలికారు. (దర్యాప్తు మొదలైన తర్వాత) 22 నెలల సుదీర్ఘ కాలవ్యవధిలో లేని తొందర.. ఈడీ బెయిల్ మంజూరు చేయగానే ఎందుకు వచ్చింది? అప్పటికప్పుడే కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేశారు? అని నిలదీశారు. ఇవే అభియోగాలకు సంబంధించి ఈడీ కేసులో బెయుల్ లభించిన వ్యక్తిని ఇంకా జైలులో నిర్బంధించటం అంటే న్యాయాన్ని నిరాకరించటమేనన్నారు.ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించిన ఫైళ్లు తప్ప ఇతర ఏ ఫైల్ మీదైనా సీఎం కేజ్రీవాల్ సంతకం చేయవచ్చని, బెయిల్ ఆంక్షలు కేవలం మద్యం పాలసీ ఫైళ్లకు మాత్రమే పరిమితమని ఆయన తరఫున వాదించిన అభిషేక్ సింఘ్వీ తెలిపారు. కేజ్రీవాల్ విడుదలయ్యారుకానీ.. ఎటువంటి అధికారాలు ఉండవంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కేజ్రీవాల్ అధికారాల్ని ఢిల్లీ ప్రభుత్వం లేదా రాష్ట్రపతి పాలన తప్ప మరే శక్తీ తొలగించలేదని పేర్కొన్నారు.సీఎం కార్యాలయానికి, ఢిల్లీ సచివాలయానికి వెళ్లొద్దని, అధికారిక ఫైళ్లపై సంతకం చేయవద్దని, ఏదైనా ఫైల్ మీద సంతకం తప్పనిసరైతే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి తీసుకోవాలని కేజ్రీవాల్ మీద ఈడీ కేసులో బెయిల్ ఆంక్షలు ఉన్నాయి. కాగా, ప్రస్తుత సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేస్తూ.. ఈడీ కేసు బెయిల్‌లో విధించిన ఆంక్షలనే విధించటం గమనార్హం. రూ.10 లక్షల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని, ఇదే మొత్తంతో ఇద్దరు ష్యూరిటీ ఇవ్వాలని పేర్కొంటూ బెయిల్ ఇచ్చింది.

# ఎమర్జెన్సీకన్నా దారుణం

(మొదటి పేజీ తరువాయి)



ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు బీఆర్ఎస్ నేతల అరెస్టులు దుర్మార్గమని విమర్శించారు. బీఆర్ఎస్‌పై, కేసీఆర్‌పై ఉన్న కక్షను తెలంగాణ మీద చూపుతున్నారని.. నంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని నియంతృత్వ పోకడలతో నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ వైఖరి వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు.గురువారం కోకాపేటలోని తన నివాసంలో ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పార్టీ నేతలు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. "శాంతి భద్రతలను అదుపు చేయకుండా హైదరాబాద్, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ గురించి రేవంత్ మాట్లాడటం సిగ్గుచేటు. రేవంత్, డీజీపీ ఎమ్మెల్యే గాన్ధీకి బందోబస్తు ఇచ్చి ఎమ్మెల్యే కౌశిక్ నివాసంపై దాడులు చేయించారు. కౌశిక్ నివాసంపై దాడి చేసింది గాంధీ కాదు సీఎం రేవంత్. బీఆర్ఎస్ నేతలను గృహ నిర్బంధం చేసిన పోలీసులు గాన్ధీని ఎందుకు నిర్బంధించలేదు?"అని ప్రశ్నించారు. హత్యాయత్నం చేసిన అరికెపూడి, ఆయన అనుచరులను బందోబస్తు మధ్య ఇంటికి పంపి.. తమను మాత్రం అరెస్టు చేసి అర్ధరాత్రి అటవీ ప్రాంతాల్లో తిప్పారని విమర్శించారు.

**భాషను మార్చుకోకుండా నీతులా?**

సీఎం రేవంత్ తన అసభ్య, సంస్కారహీనమైన భాషను మార్చుకోకుండా యూట్యూబ్ చానళ్లకు నీతులు చెబుతున్నారని.. తొమ్మిది నెలలుగా పాలనపై కాకుండా పైసలపై దృష్టి పెట్టడంతో శాంతి భద్రతలు పాతాళానికి పడిపోయాయని హరీశ్‌రావు ఆరోపించారు. "మీడియాకు లీకులు, చిట్‌చాట్‌లతో శాంతి భద్రతలు అదుపులోకి రావు. సీఎం వాడుతున్న బజారు భాషతో రాష్ట్రంలో విద్వేషాలు చెలరేగి ప్రశాంతత మంటగలుస్తోంది. పార్టీ ఫిరాయింపులపై సీఎం ఢిల్లీలో ఒకలా, గల్లీలో మరోలా మాట్లాడుతున్నారు. పీఏసీ చైర్మన్ నియామకంలో రేవంత్ వ్యాఖ్యలు దుర్మార్గం. డీజీపీ రాజకీయ కుట్రలో భాగమై ప్రతిపక్షాల గొంతును నొక్కాలని చూడటం దారుణం"అని విమర్శించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు, పీఏసీ చైర్మన్ నియామకాన్ని వ్యక్తుల మధ్య కొట్లాటగా చిత్రీకరించి పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

## ట్రిబ్యునల్ అవసరమే లేదు

(మొదటి పేజీ తరువాయి)

అంతర్‌రాష్ట్ర నదీవివాదాల చట్టం-1956లోని సెక్షన్ 3 ప్రకారం విచారణ జరిపి ఉమ్మడి ఏపీకి కేటాయించిన 1,005 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలు కలిపి మొత్తం 1,050 టీఎంసీల కృష్ణా జలాలను తెలంగాణ, ఏపీ మధ్య పునఃపంపిణీ చేయాలని, ఆ జలాలను ప్రాజెక్టుల వారీగా కేటాయించాలని పేర్కొంటూ నిరుడు అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను జారీచేసిన సంగతి తెలిసిందే. ఆ విచారణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఎస్‌వోసీని సమర్పించింది. తెలంగాణలోని ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపు ఆవశ్యకత తదితర అంశాలను అందులో ప్రస్తావించింది. దీనిపై ఏపీ ప్రభుత్వం తాజాగా కౌంటర్ రిజాయిండర్‌ను సమర్పించింది. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ద్వారానే రెండు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో మళ్లీ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం సరికాదని, సెక్షన్ 3 ద్వారా నూతనంగా ఇచ్చిన మార్గదర్శకాలు న్యాయవిరుద్ధమని తెలిపింది.

## కామ్రేడ్.. రెడ్ సెల్యూట్

న్యూఢిల్లీ: 'జోహార్ కామ్రేడ్ ఏచూరి, వుయ్ సెల్యూట్, ఉద్యమాల రహదారి ఏచూరి, మీ మరణంతో మా గుండెలు ఆగాయి, రెడ్ సెల్యూట్ కామ్రే డ్, కామ్రేడ్ ఏచూరి మమ్మల్ని విడిచి వెళ్లావా, తూ ర్పున ఎర్రని సూర్యుడా.. మా సీతారాం ఏచూరి..'అంటూ విద్యార్థులు చేసిన నినాదాలతో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) దద్దరిల్లింది. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పార్థివ దేహాన్ని శుక్రవారం సాయంత్రం విద్యార్థుల సందర్శనార్థం జేఎన్‌యూకి తరలించా రు. ఏచూరి భౌతిక కాయాన్ని చూసిన విద్యార్థులు తీవ్ర భావోద్వేగంతో నినాదాలు చేస్తూ ఘన నివాళులర్పించారు. అనంతరం 6 గంటల సమయంలో జోరువానలో జేఎన్‌యూ నుంచి వసంత్‌కుంజ్‌లోని ఆయన నివాసానికి భౌతిక కాయాన్ని తరలించారు. ఇక్కడ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తదితర ప్రముఖులు నివాళులర్పించారు. భార్య సీమ ఛిస్తీ, కుమార్తె అఖిల, కుమారుడు డానిబ్‌లను ఓదార్చారు.

**నేటి మధ్యాహ్నం ఎయిమ్స్‌కు పార్థివ దేహం**

శనివారం ఉదయం 8 గంటలకు వసంత్‌కుంజ్‌లోని ఇంటి నుంచి సీపీఎం కేంద్ర కార్యాలయానికి ఏచూరి భౌతిక కాయాన్ని తరలించనున్నారు. 10 గంటల వరకు పార్టీ కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం, అనంతరం ఓ గంట పాటు విదేశాల నుంచి వచ్చిన కమ్యూనిస్టు నేతలు, దేశంలోని ప్రముఖులు నివాళులర్పించేందుకు వీలుగా అక్కడ ఉంచనున్నారు. అనంతరం మధ్యాహ్న సమయంలో ఏచూరి భౌతిక కాయాన్ని ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించనున్నారు.



## హైడ్రాపై స్టే ఇవ్వలేం: హైకోర్టు

హైదరాబాద్: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఏర్పాటును నిలిపివేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 99పై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. అయితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) చట్ట ప్రకారం హైడ్రాకు అధికారాలను ఎలా కట్టబెడతారని సర్కార్‌ను ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఉత్తర్వులు జారీ చేసేటప్పుడు చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి తప్ప ఇష్టారాజ్యంగా జీవోలు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. హైడ్రా ఏర్పాటులో చట్టబద్ధత లోపించినట్లు కనబడుతోందని పేర్కొంది. ప్రత్యేక చట్టం లేకుండా ఏర్పాటైన హైడ్రా పని తీరు ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించింది.ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపడుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా ఏర్పాటు, విధులు, చట్టబద్ధతపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం అలియాపూర్ గ్రామంలోని తమ నిర్మాణాలను కూలగొట్టడాన్ని సవాల్ చేస్తూ డి.లక్ష్మి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైడ్రా ఏర్పాటు చట్ట విరుద్ధమని, ఈ మేరకు జారీ చేసిన జీవో 99ను కొట్టేయాలని కోర్టును కోరారు. చట్టబద్ధతలేని, నోడల్ ఏజెన్సీగా ఉన్న హైడ్రాకు విపరీత అధికారాలు కట్టబెట్టడం చెల్లదని, నోటీసులు కూడా జారీ చేయకుండా నిర్మాణాలను కూల్చడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనల అనంతరం కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. కూల్చివేతల విషయంలో ఆస్తుల టైటిల్, విద్యుత్ బిల్లుల రసీదులు తదితరాలు పరిశీలించాలని హైడ్రాకు స్పష్టం చేశారు. తర్వాత నోటీసులు జారీ చేసి, చట్టప్రకారం ముందుకు పోవాలని మరోసారి తేల్చిచెప్పారు. తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేశారు.

# కేంద్రం ఎలాంటి షరతులు లేకుండా నిధులు ఇవ్వాలి

ఒక కిలోమీటరు రోడ్డు దెబ్బతింటే కేవలం రూ.లక్ష ఖర్చు చేయాలని నిర్ణయించారని, ఈ రేట్ల ప్రకారం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన తెలంగాణకు తక్షణమే ఆర్థికసాయం అందించాలని.. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు.రాష్ట్రంలో వరదల వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందంతో శుక్రవారం సచివాలయంలో రేవంత్ సమావేశమయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రాష్ట్రంలో సంభవించిన అపార నష్టాన్ని కేంద్ర బృందాలకు ఆయన వివరించారు. ఇప్పటి వరకు వివిధ శాఖల నుంచి అందిన వివరాల ప్రకారం రూ.10,032 కోట్ల నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఇది మధ్యంతర నివేదిక మాత్రమేనని, పూర్తి వివరాలు రావాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన నష్టంతోపాటు ఇక్కడ అమల్లో ఉన్న ఎస్ఎసఆర్ రేట్ల వివరాలను కూడా కేంద్రానికి నివేదిస్తామన్నారు. వాటిని పరిశీలించి విపత్తు సాయం అందించాలని సీఎం కోరారు.

వరదల వల్ల రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని కేంద్ర బృందాలకు రేవంత్ వివరించారు. పంట పొలాల్లో బండరాళ్లు, కంకర, మట్టి మేటలు వేయడంతో రైతులు కోలుకోలేనంత నష్టపోయారని పేర్కొన్నారు. చాలా చోట్ల రహదారులు, రోడ్లు, కల్వర్టులు, చెరువులు కొట్టుకుపోవడంతో నష్టం ప్రాథమిక అంచనాలకు మించిపోయిందని వివరించారు. ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగుతో ఉన్న వరద ముప్పును నివారించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించడమే శాశ్వత పరిష్కారం అని స్పష్టం చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కేంద్రం తగినన్ని నిధులు కేటాయించేలా చూడాలని అధికారులను కోరారు. రిటైనింగ్‌వాల్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తనవంతు వాటాను భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాకాసి తండా, సత్యనారాయణ తండాతోపాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న తండాల ప్రజలను సమీపంలోని సురక్షిత



ప్రాంతాల్లో ఇళ్లను కేటాయిస్తామని.. నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని కేంద్రం అందించాలని కోరారు.వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించాక ఆదుకోవడం కన్నా ముందస్తు చర్యలతో నివారణ మార్గాలపై ఎక్కువ దృష్టిసారించాలని కేంద్ర బృందాలకు సీఎం సూచించారు. వర్షపాతం, వడగాలులు,, పర్యావరణ విపత్తులపై ముందస్తు సమాచారం, హెచ్చరికలు జారీ చేసేలా ఏర్పాట్లు ఉండాలని, వాటిపై దృష్టిసారించాలని కేంద్ర బృందానికి సూచించారు. భవిష్యత్తులో వరదలు వచ్చినప్పుడు ఆదుకునేందుకు తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్న పోలీసు బెటాలియన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఉపయోగించుకోవాలనే ఆలోచనను కేంద్ర బృందంతో సీఎం పంచుకున్నారు. మేడారం అటవీ ప్రాంతంలో వర్షాల కారణంగా 50 ఎకరాల్లో చెట్లు నేలమట్టం అవడంపైనా సమావేశంలో చర్చించారు. దేశంలో ఇప్పటి వరకు వర్షాలకు అడవుల్లో ఇలాంటి ఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని కేంద్ర బృందం అభిప్రాయపడింది.దీనిపై కేంద్రం నుంచి నిపుణుల బృందాన్ని పంపి శాస్త్రీయంగా అధ్యయనం చేయించాలని సీఎం కోరారు.

# పరిశ్రమల యాజమాన్యాలు జిల్లా అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు ఇవ్వాలి






- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ.
- విద్య ,వైద్య, సామాజిక అవసరాలకు సిఎస్ఆర్ నిధులు కేటాయించాలి.
- సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయాలి.
- జిల్లా అధికారులు పరిశ్రమల యాజమాన్యాలతో మంత్రి సమీక్ష



**సంగారెడ్డి, సెప్టెంబర్ 13 (డైలీ రిపోర్ట్):** జిల్లా అభివృద్ధికి జిల్లాలోని పరిశ్రమలు సిఎస్ఆర్ నిధులు రెండు శాతం విధిగా అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తో కలిసి జిల్లాలోని భారీ, మధ్య తరహా ,చిన్న పరిశ్రమల ప్రతినిధులు యాజమాన్యాలతో సి ఎస్ ఆర్ నిధుల కేటాయింపు పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు మాట్లాడారు. అన్ని పరిశ్రమలు రెండు శాతం సి ఎస్ ఆర్ నిధులు వెంటనే అందజేయాలని యాజమాన్యాలకు సూచించారు. గతంలో సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులను వెంటనే పూర్తి అయ్యేలా కంపెనీల ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. సిఎస్ఆర్ నిధులతో జిల్లాలో విద్య, వైద్య సామాజిక రంగాలలో మౌలిక వసతుల మెరుగు నిధులు కేటాయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, పరిశ్రమల శాఖ అధికారులు, విద్యాశాఖ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు ప్రతినిధులు, పాల్గొన్నారు.




## విద్యా వైద్యంపై మంత్రి సమీక్ష

**సంగారెడ్డి సెప్టెంబర్ 13: (డైలీ రిపోర్ట్):** రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా లో ఉన్న అతి పెద్ద, పెద్ద, మధ్య స్థాయి కంపెనీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం లో పాల్గొన్నారు.సంగారెడ్డి జిల్లా లో సామాజిక, విద్యా , వైద్య రంగాల అభివృద్ధికి సిఎస్ఆర్ ఫండ్స్ కేటాయింపుల పై చర్చ జరిగింది. జిల్లాలో ఉన్న కంపెనీ లు జిల్లా అభివృద్ధికి సిఎస్ఆర్ ఫండ్స్ ను తమవంతు భాధ్యత గా జిల్లా అభివృద్ది కి 2 శాతం సిఎస్ఆర్ ఫండ్స్ ను విడుదల చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ కంపెనీ ప్రతినిధులకు, యాజమాన్యాలకు సూచించారు. గతంలో సిఎస్ఆర్ ఫండ్స్ తో చేపట్టిన పనులను వెంటనే పూర్తి అయ్యేలా కంపెనీ ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సంబంధిత శాఖ ప్రభుత్వ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


## ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకున్న శంకర్‌పల్లి బిజెపి నాయకులు

**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 13: (డైలీ రిపోర్ట్):** ఖైరతాబాద్ వినాయకుడిని శుక్రవారం శంకర్‌పల్లి మండల బిజెపి అధ్యక్షుడు రాములు గౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. రాములు గౌడ్ మాట్లాడుతూ మండల, మున్సిపల్ ప్రజలపై విగ్నేశ్వరుని కరుణ, కటాక్షాలు ఉండాలని కోరుకున్నట్టు పేర్కొన్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో మున్సిపల్ ఇంచార్జి వాసుదేవ్ కన్నా, సీనియర్ నాయకులు పరమేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహ, మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్ ఉన్నారు.



## మహాలింగాపురంలో భారీ సెట్టింగ్ లో వినాయకుడు

- నిత్య పూజలతో బిజీబిజీగా గణనాథుడి మండపాలు
- ఆకట్టుకుంటున్న గణేష్ మండపాలు
- అద్భుతంగా ఇంటీరియర్ అండ్ ఎక్టీరియర్ డిజైన్స్
- భారీ సంఖ్యలో వీక్షించడానికి వస్తున్న ప్రజలు



**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 13: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని మహాలింగాపురం గ్రామంలో భారీ సెట్లలో గజనాదుడు కొలువైనాడు. శ్రీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో బాహుబలి సెట్లను తలపించే విధంగా సెట్లు వేశారు. గత కొన్ని సంవత్సరాలుగా భారీ సెట్ల లో ఆ గజనాదుడిని పెట్టండం ఇక్కడ ఆనవాయితీగా కొనసాగుతుంది. ఈ సెట్లలోకి వెళ్లి ఆ గజనాదుడి దర్శనం చేసుకోవాలని పర్యాటకులు సైతం రావడం సంతోషకరం. వేద పండితుల ద్వారా నిత్య పూజలు చేస్తూ గ్రామంలోని అన్ని మండపాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి రోజు ఉదయం ప్రారంభమయ్యే పూజలు అర్ధరాత్రి వరకు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఈ భారీ సెట్లలో కొలువుదీరిన వినాయకుడి దర్శనానికి గ్రామంలోని ప్రజలు తండోప తండాలుగా వచ్చి దర్శనం చేసుకోవడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఒక్కసారి గజనాధుని దర్శించుకోవడానికి సెట్ లోపలికి వెళితే మళ్ళీ రావాలనిపించదు. అద్భుతమైన డిజైన్స్ తో చక్కటి లైటింగ్ తో ఇంటీరియర్ డిజైన్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటున్నాయి.

## జిల్లాలో ఎక్కడ పారిశుధ్య సమస్య కనిపించకుండా చర్యలు చేపట్టాలి

- మున్సిపాలిటీలలో అవసరం ఉన్నచోట డంప్ యార్డులకు స్థల సేకరణ జరపాలి
- భారీ వర్షాలకు దెబ్బతిన్న పనులు వెంటనే మరమ్మత్తులు చేయాలి
- జిల్లాలో చెరువుల కుంటలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలి

**నీటిపారుదల శాఖ మున్సిపల్ రెవెన్యూ పంచాయతీరాజ్ పరిశ్రమల శాఖ అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష.**




**సంగారెడ్డి సెప్టెంబర్ 13 (డైలీ రిపోర్ట్):** జిల్లాలో ఎక్కడ పారిశుద్ధ సమస్య తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్లో కలెక్టర్ క్రాంతివల్లూరు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ మాధురులతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడారు. జిల్లాలో పారిశుద్ధ సమస్యలతో కుండా చూడాలని వారానికి రెండుసార్లు ఫాగింగ్ చేయాలని, డెంగ్యూ కేసులు రాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ,పరిసరాల పరిశుభ్రత పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన కల్పించాలన్న తడి పొడి చెత్తను ప్రజలు వేరుచేసి మున్సిపల్, పంచాయతీ వాహనాలలో వేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో డంపు యార్డు లు అవసరం ఉన్నచోట స్థల సేకరణ జరపాలని అధికారులకు సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పనులు రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిన్నారం మండలంలో డెలివరీ ఆసుపత్రి లో 24 గంటల సర్వీస్ అందించాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో హెచ్ఎండిఏ పరిధిలో గుర్తించిన చెరువులు కుంటలను అన్యాక్రాంతం కాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని చెరువుల కుంటలు ఆక్రమణ పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి ఆదేశించారు. భారీ వర్షాల వల్ల జిల్లాలో జరిగిన పంట నష్టం అంచనాలు చెరువుల కుంటలో జరిగిన నష్టం వివరాలను వెంటనే పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని అధికారులకు ఆదేశించారు. రుణమాఫీలో లబ్ది పొందిన వారికి వెంటనే పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ నీటిపారుదల శాఖ పరిశ్రమలు పంచాయతీరాజ్ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది

'ఈ మధ్యకాలంలో నేను చూసిన బెస్ట్ సినిమా ఇది. ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. పేరెంట్స్ అందరూ వారి పిల్లలతో కలిసి చూడాల్సిన సినిమా' అన్నారు నాని. సోమవారం జరిగిన '35-చిన్న కథ కాదు' సినిమా ప్రీరిలీజ్ వేడుకను ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి నందకిషోర్ ఈమాని దర్శకుడు. రానా సమర్పకుడు. ఈ నెల 6న విడుదలకానుంది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ..ఇండస్ట్రీలో తనకు రానా మంచి మిత్రుడని, న్యూటాలెంట్‌ను ఎప్పుడూ ఎంకరేజ్ చేస్తుంటాడని, ప్రతీ కుటుంబం ఈ సినిమాతో కనెక్ట్ అవుతుందని అన్నారు. తనకు స్కూల్ రోజుల్లో లెక్కల సబ్జెక్ట్ అస్సలు నచ్చేది కాదని, ఈ కథ విన్నప్పుడు తన బయోపిక్ అనుకున్నానని రానా చెప్పారు. ఈ చిత్రాన్ని అమ్మలందరికీ అంకితమిస్తున్నానని కథానాయిక నివేద థామస్ పేర్కొంది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



# కంగన 'ఎమర్జెన్సీ'కి దక్కని ఊరట

### తక్షణం సెన్సార్ సర్టిఫికేట్ ఇవ్వాలని ఆదేశించలేమన్న బాంబే హైకోర్టు

ముంబై: కంగనా రనౌత్ నటించి, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'ఎమర్జెన్సీ'సినిమాకు విడుదల కష్టాలు తప్పట్లేవు. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ ఆరో తేదీన సినిమా విడుదల కావాల్సి ఉన్నా ఇంతవరకు సినిమా సర్టిఫికేషన్ పూర్తవలేదు. తక్షణం సర్టిఫై చేయాల్సిందిగా సెన్సార్ బోర్డును ఆదేశించలేమని జస్టిస్ బీపీ కోలాబవాలా, జస్టిస్ ఫిర్దోశ్ పూనీవాలాల బాంబే హైకోర్టు ధర్మాసనం బుధవారం స్పష్టంచేసింది. సినిమాకు సర్టిఫికేట్ ఇచ్చేలా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ)ను ఆదేశించాలంటూ సినిమా నిర్మాణసంస్థ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ వేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు బుధవారం విచారించింది. సినిమాలో తమ వర్గాన్ని తక్కువ చేసి చూపించారని కొందరు సిక్కులు మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించడం తెల్సిందే. దీంతో సినిమాకు సర్టిఫికేట్ ఇచ్చే ముందు వీరి వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని సీబీఎఫ్‌సీని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశించడం తెల్సిందే. ఈ అంశాన్ని బుధవారం బాంబే హైకోర్టు ప్రస్తావించింది. 'సర్టిఫికేషన్ అంశంలో ఇప్పటికే మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఆ ఉత్తర్వులు లేకపోయి ఉంటే ఈరోజే సర్టిఫై చేయాలని సీబీఎఫ్‌సీని ఆదేశించేవాళ్లం. ఈ దశలో మేం కలుగజేసుకోవడం సబబు కాదు. అందుకే తక్షణం సర్టిఫై చేయాలని ఆదేశించలేం. అయితే సినిమాపై వస్తున్న అభ్యంతరాలపై ఈనెల 18లోపు సీబీఎఫ్‌సీ నిర్ణయం తీసుకోవాలి'అని హైకోర్టు సూచించింది. సినిమాకు ఎలాంటి ఊరట లభించకపోవడంతో కంగన అసహనంతో ఒక పోస్ట్‌చేశారు. "ఎమర్జెన్సీ సినిమాకు సర్టిఫికేట్ ఇవ్వకుండా సెన్సార్‌బోర్డు చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తోందని స్వయంగా బాంబే హైకోర్టే చెబుతోంది'అని కంగన 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.

# హుషారెత్తించే గీతం




ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర-1' ఈ నెల 27న విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. 'చుట్టమల్లే..' అనే పాటకు యూట్యూబ్‌లో రికార్డు స్థాయి వీక్షణలు దక్కాయి. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతానికి సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి 'దావుడి' అనే మూడో పాటను బుధవారం విడుదల చేశారు. ఫాస్ట్‌బీట్‌తో సాగిన ఈ పాటలో నాయకానాయికలు ఎన్టీఆర్, జాన్వీకపూర్‌ల నృత్యాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. రామజోగయ్యశాస్త్రి రచించిన ఈ గీతాన్ని నకష్ అజీజ్, ఆకాశ ఆలపించారు. ప్రేక్షకుల్ని హుషారెత్తించే గీతమిదని, థియేటర్లో అభిమానులతో డ్యాన్స్‌లు చేయిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. సైఫ్‌అలీఖాన్, ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె నిర్మిస్తున్నారు.



# పెళ్లిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా..!

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. దాదాపు రెండు దశాబ్దాలుగా టాలీవుడ్‌లో అగ్రహీరోయిన్‌గా కొనసాగుతున్నది. 2005లో తెలుగులో శ్రీ మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత వరుస సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారింది. తక్కువ సమయంలో టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళం, హిందీలోనూ సినిమాలు, వెబ్ సిరీస్ చేస్తూ అలరిస్తున్నది. కొంతకాలంగా విజయ్ వర్మతో మిల్కీబ్యూటీ డేటింగ్ చేస్తున్నది. పెళ్లి చేసుకుంటామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత త్వరలోనే పెళ్లి పీటలక్కెబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి. తమన్నా ఎక్కడికి వెళ్లినా పెళ్లిపై ప్రశ్నలు ఎదురుకావడంతో దాట వేస్తూ వచ్చింది. తాజాగా అందరినీ షాక్‌కు గురి చేస్తూ పెళ్లిపై కీలక కామెంట్స్ చేసింది. ప్రస్తుతం తమన్నా కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మిల్కి బ్యూటీ హైదరాబాద్‌లో ఓ షాప్ ఓపెనింగ్ కార్యక్రమానికి అతిథిగా హాజరైంది. ఈ సందర్భంగా పెళ్లిపై పలువురు జర్నలిస్ట్‌లు ప్రశ్నించారు. తాను పెళ్లి చేసుకోవడం లేదు.. కంగారు పడొద్దంటూ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఇదిలా ఉండగా.. తమన్నా బాలీవుడ్‌పై దృష్టి సారించింది. హీరోయిన్‌తో పాటు అతిథిపాత్రల్లోనూ నటిస్తున్నది. చివరిసారిగా తమిళ రిమేక్ మూవీ బాక్‌లో కనిపించింది. ప్రస్తుతం తెలుగులో ఓదెల-2 మూవీలో నటిస్తున్నది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ కొనసాగుతున్నది.



# గాయాలపాలవకుండా యాక్షన్ స్టార్ కాగలనా?

యాక్షన్ సీన్ చిత్రీకరణలో హీరోయిన్ సమంతకు గాయమైంది. ఈ విషయాన్ని తనే స్వయంగా వెల్లడించింది. మోకాలికి అయిన గాయానికి సూదులతో చికిత్స తీసుకుంటున్న ఫోటోను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేసింది. గాయాలపాలవకుండా నేను యాక్షన్ స్టార్ అవగలనా? అని అని రాసుకొచ్చింది. అయితే ఏ సినిమా షూటింగ్‌లో గాయపడిందన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. అయితే సామ్ చేతిలో ప్రస్తుతం బంగారం అనే మూవీ ఉంది. బహుశా ఈ సినిమా చిత్రీకరణలోనే తను గాయపడి ఉండొచ్చని తెలుస్తోంది. కాగా ఈ బ్యూటీ చివరిసారిగా ఖుషి సినిమాలో కనిపించింది. అనంతరం సిటాడెల్: హనీ బన్నీ అనే వెబ్ సిరీస్‌లో యాక్ట్ చేసింది. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సిరీస్ నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. వరుణ్ ధావన్ హీరోగా, సమంత హీరోయిన్‌గా నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించారు. ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707